క్లుప్తంగా

సబ్సిడీ గొర్రెల పంపిణీ



రాజోళి: మండల కేంద్రంలో గురువారం పశు సంవర్ధకశాఖ అధికారులు సబ్సిడీపై గొర్రెలను పంపిణీ చేశారు. ప్రభుత్వం సబ్సిడీపై మంజూరు చేసిన 12 యూనిట్ల గొర్రెలను లబ్ధిదారులకు అందజేసినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, ఉపసర్పంచ్ గోపాల్, డాక్టర్ పుష్పలత, శ్రీశైలం, కార్తీక్, సురేష్, రాఘవేంద్ర పాల్గొన్నారు.

మొండివైఖరి వీడాలి



గద్వాల అర్బన్: సెకండ్ ఏఎన్ఎంల సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం మొండివైఖరి వీడాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు, ఎస్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు వెంకటేష్ అన్నారు. జిల్లా కేంద్రంలో సెకండ్ ఏఎన్ఎంలు చేపట్టిన నిరవధిక సమ్మె గురువారం రెండో రోజుకు చేరింది. సమ్మెకు వారు మద్దతు తెలిపి మాట్లాడారు. కాంట్రాక్టు ఏఎన్ఎంలను రెగ్యులరైజ్ చేయకుండా వెట్టిచాకిరి చేయించుకుంటున్నారని, ప్రభుత్వం వెంటనే సెకండ్, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఏఎన్ఎంలను ఎలాంటి షరతులు లేకుండా రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు.

అక్రమ కట్టడాన్ని తొలగించండి



శాంతినగర్: ప్రభుత్వ భూమిని కబ్జా చేసి అనుమతి లేకుండా చేపట్టిన ఇంటి నిర్మాణాన్ని తొలగించాలని డిప్యూటీ తహసీల్దార్ వేణుగోపాల్‌రెడ్డికి వడ్డేపల్లి మున్సిపల్ కౌన్సిలర్లు గురువారం ఫిర్యాదు చేశారు. వడ్డేపల్లి వసంత మాధవస్వామి గట్టుపైకి వెళ్లే దారిలో ఆలయ అభివృద్ధి కోసం వదిలిన స్థలంలో ఓ వ్యక్తి అక్రమంగా ఇంటి నిర్మాణం చేపడుతున్నాడని పేర్కొన్నారు. ఇంటి నిర్మాణంతో భక్తులు, జాతరకు ఇబ్బందులు తలెత్తుతాయని కౌన్సిలర్లు వివరించారు. అంతేగాక ఇతరులు మిగతా స్థలాన్ని ఆక్రమించుకుని నిర్మాణాలు చేపట్టే అవకాశం ఉందన్నారు. అక్రమ నిర్మాణ పనులను నిలిపివేయాలని డిప్యూటీ తహసీల్దార్‌ను కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో మున్సిపల్ వైస్ చైర్మన్ సుజాత, కౌన్సిలర్లు హెచ్.సుజాత, ఆంజనేయులు, హెచ్.దేవమ్మ, నాగశిరోమణి ఉన్నారు.

ఆదిశిలా క్షేత్రంలో సప్తాహ భజనలు

మల్దకల్: ఆదిశిలా క్షేత్రంలో సప్తాహ భజనలు కొనసాగుతున్నాయి. స్వయంభూ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం వివిధ గ్రామాలకు చెందిన భజన మండలి సభ్యులు సంకీర్తనలు ఆలపించారు. భజన మండలి సభ్యులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఆలయ అధికారులు ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు అరవిందరావు, చంద్రశేఖర్‌రావు, నాగరాజుశర్మ పాల్గొన్నారు.

యువకుడిపై కేసు నమోదు

ఉండవెల్లి: మండల కేంద్రానికి చెందిన వివాహితను ఫోన్‌లో వేధింపులకు గురి చేసిన బొంకూరుకు చెందిన స్వాములుపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ బాల్‌రాజు తెలిపారు. ప్లాస్టిక్ వస్తువులు అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్న వివాహితకు ఫోన్ చేసి వేధింపులకు పాల్పడడంతోపాటు ఆమె భర్తను బెదిరింపులకు గురిచేసినట్లు పేర్కొన్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు స్వాములపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వివాహిత అదృశ్యం

గద్వాల క్రైం: వివాహిత అదృశ్యమైన ఘటన జిల్లా కేంద్రంలో చోటుచేసుకుంది. పట్టణ ఎస్ఐ శ్రీకాంత్ కథనం మేరకు.. జిల్లా కేంద్రంలోని కుంటవీధికి చెందిన సుగుణ మూడేళ్ల బాబుతో గురువారం ఇంటి నుంచి బయటికి వెళ్లి తిరిగిరాలేదు. ఆమె కోసం కుటుంబ సభ్యులు గాలించినా ఫలితం లేకపోయింది. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అపహరించిన దూడను విక్రయించేందుకు యత్నం

అయిజ: ఎక్కడో అపహరించిన లేగదూడను గురువారం పట్టణంలోని పశువుల సంతలో విక్రయించేందుకు ఓ వ్యక్తి యత్నించాడు. అయితే రైతులకు అనుమానం కలిగి వివరాలు సేకరించే ప్రయత్నం చేయగా.. సంబంధిత వ్యక్తి భయపడి అక్కడి నుంచి పారిపోయాడు. విషయాన్ని రైతు సంఘం నాయకులు పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు.

వాగులు దాటేదెలా?

- రహదారులపై ప్రమాదకరంగా మారిన వాగులు
- వంతెనల నిర్మాణంపై దృష్టి సారించని పాలకులు
- వర్షాకాలంలో గ్రామాలకు నిలిచిపోతున్న రాకపోకలు
- అవస్థలు పడుతున్న ప్రజలు



ఆర్.గార్లపాడు సమీపంలో పారుతున్న వాగును దాటుతున్న గ్రామస్తులు (ఫైల్)

ఎర్రవల్లిచౌరస్తా: ప్రధాన రహదారులపై ఉన్న వాగులు వర్షాకాలంలో ప్రమాదకరంగా మారుతున్నాయి. ఉధృతంగా ప్రవహించే వాగులతో రాకపోకలు నిలిచిపోతున్నాయి. వాగులపై వంతెనలు సక్రమంగా లేకపోవడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. భారీ వర్షాలు కురిసి వాగుల్లో నీటి ఉధృతి ఎక్కువైతే ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని రాకపోకలు సాగించాల్సి వస్తోంది. గ్రామాల్లో ఏదైనా అత్యవసరం ఏర్పడితే ఊరు కూడా దాటలేని పరిస్థితి ఉంటుందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తప్పని పరిస్థితుల్లో ఎవరైనా ప్రాణాలకు తెగించి వాగును దాటేందుకు ప్రయత్నిస్తే ప్రమాదాల బారిన పడుతున్నారని వాపోతున్నారు. ప్రతి ఏడాది వర్షాకాలంలో ప్రజలు ఇబ్బందులను ఎదుర్కోవడం పారిపాటిగా మారింది. వాగులపై అవసరమైన చోట వంతెనలు నిర్మించాలని ప్రజాప్రతినిధులు, అధికారులకు విన్నవిస్తున్నా పట్టించుకోవడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి వాగులపై వంతెనలు నిర్మించాలని కోరుతున్నారు.



ఫిల్లర్ గుంతలకే పరిమితమైన పెద్దవాగు బ్రిడ్జి పనులు

నియోజకవర్గంలో ఇదీ పరిస్థితి..

- ఇటిక్యాల మండలంలోని ఆర్.గార్లపాడు నుంచి ఎర్రవల్లి వెళ్లే దారిలో పెద్దవాగు వర్షాకాలంలో రోజుల తరబడి ఉధృతంగా ప్రవహిస్తుంది. వంతెన నిర్మాణం ప్రారంభమై ఏండ్లు గడుస్తున్నా పనులు పూర్తి కాకపోవడంతో సమీప గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అత్యవసర సమయంలో వాగును దాటేందుకు యత్నించి ప్రమాదాల బారిన పడ్డారు.
- సాసనూలు నుంచి షేక్‌పల్లి మీదుగా ఎర్రవల్లి, ఇటిక్యాల నుంచి చాగాపురం, ఉదండాపురం నుంచి ఎస్సీకాలనీ, ఉదండాపురం నుంచి సాతర్లకు వెళ్లే దారిలో ఉన్న వాగులపై వంతెనలు లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు.
- మానపాడు మండలంలో అమరవాయి నుంచి మానపాడు, చెన్నిపాడు నుంచి పెద్ద పోతులపాడు, మానవపాడు నుంచి చెన్నిపాడుకు వెళ్లే దారిలో ఉన్న పలు వాగులు భారీ వర్షాలకు ఉప్పొంగి రోజుల తరబడి పారుతాయి. దీనివల్ల ఆయా గ్రామాల ప్రజలు రాకపోకలు సాగించేందుకు ముప్పు తిప్పలు పడుతున్నారు.
- ఉండవెల్లి మండలంలో పుల్లూరు నుంచి కలుగోట్లకు వెళ్లే దారిలో ఉన్న వాగు వర్షం పడితే చాలు ఉధృతంగా ప్రవహిస్తుంది. గతంలో ఈ వాగులో అనేక ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. వాగులో కారు ప్రమాదం జరిగి గర్భిణి కూడా మృతి చెందింది. దీంతోపాటు ఉండవెల్లి నుంచి చిన్న ఆముదాలపాడు, ప్రాగటూరు నుంచి మారమునగాల, భైరాపురం నుంచి బస్వాపురం వెళ్లే దారిలో గల వాగులను వర్షాకాలంలో దాటలేని పరిస్థితి ఏర్పడుతోంది.
- అలంపూర్ మండలంలో సుల్తానాపురం నుంచి జిల్లెలపాడుకు వెళ్లే దారిలో ఉన్న వాగు ప్రతి వర్షాకాలంలో ఉధృతంగా ప్రవహిస్తుంది. దీంతో రెండు గ్రామాల ప్రజల రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుంది.
- రాజోలి మండలంలో తుమ్మిళ్ల నుంచి మాన్‌దొడ్డి, ముండ్లదిన్నె నుంచి రాజోళి, అశోక్‌నగర్ క్యాంపు నుంచి తుమ్మిళ్లకు వెళ్లే దారిలో ఉన్న వాగులు వర్షాకాలం ప్రారంభమైతే రోజుల తరబడి ఉధృతంగా ప్రవహిస్తాయి. దీని వల్ల సమీప గ్రామాల ప్రజలు అత్యవసర పరిస్థితుల్లో వాగులను దాటేందుకు అష్టకష్టాలు పడుతున్నారు.
- వడ్డేపల్లి మండలంలో రామాపురం నుంచి వల్లూరు, జూలకల్ నుంచి స్టేజీ వరకు, కొంకల నుంచి వడ్డేపల్లి, తనగల నుంచి వడ్డేపల్లి వెళ్లే మార్గంలో ఉన్న వాగులు వర్షాకాలంలో ఉధృతంగా ప్రవహిస్తాయి. రోజుల తరబడి వాగులు పారడంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు.
- అయిజ మండలంలో ఎక్లాస్‌పురం నుంచి దేవబండ వెళ్లే దారిలో ఉన్న వాగు వర్షాకాలం ప్రారంభమైతే చాలు పొంగి పొర్లుతుంది. దీనివల్ల ఏక్లాస్‌పురం, దేవనబండ గ్రామాలకు రోజుల తరబడి రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుంది. వర్షాకాలంలో ఆయా గ్రామాల ప్రజలు, రైతులు వాగును దాటేందుకు ఇబ్బందులు పడుతున్నారు.

వంతెనలు నిర్మించాలి..



మా గ్రామం నుంచి మండల కేంద్రానికి వెళ్లే రోడ్డుపై వాగులు పారడంవల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. ముఖ్యంగా ఎర్రవల్లి చౌరస్తాకు వెళ్లే దారిలో నాలుగు వాగులు ఉండటం వల్ల పలు గ్రామాల ప్రజలు, వాహనదారుల రాకపోకలకు అంతరాయం కలుగుతుంది. వర్షాకాలంలో వాగుల కారణంగా రోజుల తరబడి గ్రామంలోనే ఉండాల్సి వస్తుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఉప్పొంగి ప్రవహించే వాగులపై వంతెనలను నిర్మించాలి.

– బోయ రాజు, సాసనూలు

పనులు జరగడం లేదు..



మా ఊరి సమీపంలోని పెద్ద వాగుపై బ్రిడ్జి నిర్మాణం చేపట్టి మూడేండ్లు పూర్తయింది. పనులు నత్తనడకన సాగుతుండటంతో నేటి వరకు పూర్తి కాలేదు. తాత్కాలికంగా ఏర్పాటు చేసిన మట్టి రోడ్డు పోయినసారి వర్షాలకు పూర్తిగా కొట్టుకుపోయింది. వర్షాకాలంలో వాగు పొంగి పొర్లడం వల్ల నెలరోజుల పాటు వాగును దాటడానికి రాలేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలి.

– చిన్నవీరన్న, ఆర్.గార్లపాడు

నివేదికలు పంపాం..

గార్లపాడు వద్ద బ్రిడ్జి నిర్మాణానికి తీసిన ఫిల్లర్ గుంతల్లోకి వర్షపునీరు చేరడంతో పనులు నిలిచిపోయాయి. ఫిల్లర్ గుంతల వద్ద పూర్తిగా రాళ్ల గుండ్లు ఉండటంతో బ్లాస్టింగ్ చేయడానికి ఎక్కువ సమయం తీసుకుంటుంది. అంతలోపే తిరిగి వర్షాకాలం ప్రారంభం కావడం, జూరాల కాల్వ నుంచి నీరు నితంతరం వాగులోకి రావడంతో పనులు చేయడానికి ఇబ్బందిగా ఉంది. నియోజకవర్గంలోని రోడ్లపై ఉన్న వాగుల వద్ద బ్రిడ్జిల నిర్మాణానికి సంబంధించి నివేదికను ఉన్నతాధికారులకు అందజేశాం. వారి నుంచి అనుమతులు రాగానే టెండర్లు వేసి నిర్మాణ పనులను ప్రారంభిస్తాం.

– మహేష్‌కుమార్, ఆర్అండ్‌బీ ఏఈఈ, అలంపూర్

పల్లెప్రగతితో గ్రామాలు అభివృద్ధి

- ఎమ్మెల్యే అబ్రహం

అలంపూర్ రూరల్: ప్రభుత్వం చేపట్టిన పల్లె ప్రగతి కార్యక్రమంతో గ్రామాలు అన్నివిధాలా అభివృద్ధి చెందాయని ఎమ్మెల్యే వీఎం అబ్రహం అన్నారు. గురువారం రూ.9కోట్లతో ర్యాలంపాడ్–జిల్లెలపాడు బీటీరోడ్డు నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తుంగభద్ర నదిపై వంతెనను రూ.40కోట్లతో పూర్తి చేశామన్నారు. ర్యాలంపాడ్, సుల్తాన్‌పూర్, జిల్లెలపాడ్ గ్రామాల ప్రజల బీటీరోడ్డు కలను సాకారం చేసేందుకు నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. విద్యుత్ సమస్య పరిష్కారానికి రూ.15లక్షలు వెచ్చించినట్లు చెప్పారు. మిషన్ భగీరథ పథకంతో తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించినట్లు తెలిపారు. రూ.కోటికిపైగా నిధులతో అన్ని గ్రామాల్లో సీసీరోడ్లు, డ్రైయినేజీలు నిర్మించినట్లు వివరించారు. గ్రామాలను సుందరంగా తీర్చిదిద్దడమే సీఎం కేసీఆర్ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

నిధుల వివరాలివ్వండి



ధరూరు: మండలంలోని కోతులగిద్దలో 2014 నుంచి 2023 వరకు జరిగిన అభివృద్ధి పనులకు సంబంధించిన నిధుల వివరాలను ఇవ్వాలని నడిగడ్డ హక్కుల పోరాట సమితి మండల నాయకులు గురువారం పంచాయతీ కార్యదర్శి వసుంధరకు వినతిపత్రం అందజేశారు. సీసీరోడ్లు, వ్యక్తిగత మరుగుదొడ్లు, ఇంకుడుగుంతలు తదితర అభివృద్ధి పనులకు వెచ్చించిన నిధుల వివరాలు ఇవ్వాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో కృష్ణ, సురేష్, వీరేష్, మల్లేష్, జమ్మన్న పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో విగ్రహ ప్రతిష్ఠాపన



ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి

కేటీదొడ్డి: మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో గురువారం విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేశారు.అనంతరం ఉమిత్యాలలో ఆంజనేయస్వామి ఆలయ పైకప్పు నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దైవచింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని, ప్రతి ఒక్కరూ భక్తిభావం అలవర్చుకోవాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రాజశేఖర్, వైస్‌ఎంపీపీ రామకృష్ణ నాయుడు, ఉరుకుందు, హనుమంతు, శేషంపల్లి నర్సింహులు, చక్రధర్, యుగంధర్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై అలసత్వం వద్దు



మాట్లాడుతున్న జెడ్పీటీసీ హన్మంతురెడ్డి

ఎర్రవల్లిచౌరస్తా: గ్రామాల్లో అభివృద్ధి పనుల పూర్తిపై అధికారులు అలసత్వం చేయొద్దని జెడ్పీటీసీ హన్మంతురెడ్డి అన్నారు. ఇటిక్యాల మండల పరిషత్ కార్యాలయంలో గురువారం వైస్‌ఎంపీపీ సుజాత అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్థిక సంఘం నిధులు, జనరల్ నిధులతోపాటు ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై అధికారులు, ప్రజాప్రతినిధులతో సమీక్షించారు. అనంతరం జెడ్పీటీసీ మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందేలా చూడాలని అధికారులకు సూచించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు రోజు గ్రామాల్లో పర్యటించి ప్రజల సమస్యలను గుర్తించి పరిష్కరించాలని తెలిపారు. సమావేశంలో పీఏసీఎస్ చైర్మన్ రంగారెడ్డి, ఎంపీడీఓ రాఘవ, ఏఓ అయూబ్, డిప్యూటీ తహసీల్దార్ నందిని, ఏపీఓ అనిల్ తదితరులు ఉన్నారు.

పిల్లలపై ప్రత్యేక దృష్టి సారించాలి



అవగాహన కల్పిస్తున్న అధికారులు

గట్టు: అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో వయస్సుకు తగిన బరువు, ఎత్తు లేని పిల్లలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఐసీడీఎస్ సీడీపీఓ కమలాదేవి అన్నారు. గురువారం గట్టు, మాచర్ల సెక్టార్ పరిధిలోని అంగన్‌వాడీ టీచర్లకు ఎస్ఎస్ఎఫ్‌పీపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రతినెలా చిన్నారుల ఎత్తు, బరువును తప్పనిసరిగా నమోదు చేయాలన్నారు. ఎత్తుకు తగిన బరువు లేని పిల్లలను గుర్తించి, సమీపంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆకలి పరీక్షలు చేయించాలని సూచించారు. అతి తక్కువ బరువు ఉన్న పిల్లలకు బాలామృతం ప్లస్‌తోపాటు అనుపోషణ విలువ కలిగిన ఆహారం అందించాలని తెలిపారు. అనంతరం పౌష్టికాహారం అందించే విధానంపై జిల్లా కోఆర్డినేటర్ కళ్యాణ్ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వాసంతి తదితరులు పాల్గొన్నారు.

గృహలక్ష్మి దరఖాస్తుల పరిశీలన



దరఖాస్తుదారుల వివరాలు సేకరిస్తున్న ఎంపీడీఓ రవీంద్ర

శాంతినగర్: వడ్డేపల్లి మండలం రామాపురంలో గృహలక్ష్మి పథకానికి దరఖాస్తు చేసుకున్న వారి వివరాలను ఎంపీడీఓ రవీంద్ర గురువారం పరిశీలించారు. గ్రామంలో మొత్తం 175 మంది గృహలక్ష్మి పథకానికి దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. పూర్తి విచారణ అనంతరం అర్హులైన వారిని పథకానికి ఎంపిక చేస్తామని తెలిపారు. ఎంపీడీఓ వెంట పంచాయతీ కార్యదర్శి లక్ష్మణ్ ఉన్నారు.

అడిషనల్ కలెక్టర్‌కు వినతి



గట్టు: మండలంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గురువారం ఎంపీపీ విజయ్‌కుమార్ అడిషనల్ కలెక్టర్ అపూర్వచౌహాన్‌కు వినతి పత్రం అందజేశారు. మనఊరు–మనబడి పనుల పురోగతిని సమీక్షించాలని, ఉపాధ్యాయుల కొరతను తీర్చేందుకు విద్యావలంటీర్లను నియమించాలని కోరారు. మండలంలో ప్రారంభానికి సిద్ధంగా ఉన్న మూడు ఆరోగ్య ఉప కేంద్రాలను ప్రారంభించడంతోపాటు వైద్యసిబ్బంది కొరతను తీర్చాలని విజ్ఞప్తి చేశారు.

మత్స్యసంబురం



ఉండవెల్లి: మండలంలోని శేరుపల్లె కృష్ణానది తీరంలో గురువారం జాలర్లకు 10కిలోల బొచ్చ రకం చేప లభించింది. కర్నూల్ మార్కెట్‌లో చేపను రూ.3వేలకు కొనుగోలు చేసినట్లు గ్రామానికి చెందిన మాబు తెలిపారు. కృష్ణానది తీరంలో పెద్ద చేపలు లభించడం సంతోషంగా ఉందన్నారు.

మండలస్థాయి క్రీడాపోటీలు



అలంపూర్ రూరల్: పట్టణంలోని మాంటిస్సోరి పాఠశాలలో గురువారం ఎస్‌జీఎఫ్ మండలస్థాయి క్రీడా పోటీలు నిర్వహించారు. కబడ్డీ, వాలీబాల్, ఖోఖో పోటీల్లో ప్రతిభ కనబర్చిన క్రీడా జట్లకు ఎంఈఓ అశోక్‌కుమార్, రిటైర్డ్ ఎస్ఐ చిన్నయ్య బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మనోరమ, హెచ్‌ఎంలు బాలాజీ, కృష్ణకుమార్, హేమలత, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మానవపాడు: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల మైదానంలో ఎస్‌జీఎఫ్ మండలస్థాయి కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీలు నిర్వహించనున్నట్లు డీవైఎస్ఓ ఆనంద్, ఎంఈఓ శివప్రసాద్ తెలిపారు. గురువారం క్రీడా జట్ల ఎంపికలను ప్రారంభించారు. ముందుగా క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. హెచ్‌ఎం చంద్రశేఖర్ పాల్గొన్నారు.

గట్టు: మండలంలోని మాచర్ల ఉన్నత పాఠశాల మైదానంలో ఈనెల 19న ఎస్‌జీఎఫ్ మండలస్థాయి క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు ఎంఈఓ కొండారెడ్డి తెలిపారు. ఉన్నత పాఠశాలల్లో 8, 9, 10 తరగతులు చదువుతున్న అండర్–14, 17 బాలబాలికలకు వాలీబాల్, ఖోఖో, కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మండలస్థాయిలో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని తెలిపారు.

'మళ్లీ పొరపాట్లు జరగవు'

జోగుళాంబ శక్తిపీఠం: జోగుళాంబ ఆలయ సీనియర్ అసిస్టెంట్ రంగనాథ్‌పై సస్పెన్షన్ వేటు వేయడం వల్ల మళ్లీ ఏ ఉద్యోగి తప్పిదాలకు పాల్పడరని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రంగనాథ్‌పై దేవాదాయశాఖ తీసుకున్న నిర్ణయం సరైందని, ఇలాంటి కఠిన చర్యలు తీసుకోవడం వల్ల భవిష్యత్‌లో మళ్లీ పొరపాట్లు జరగవని ఆశాభావం వ్యక్తం చేశారు. అదేవిధంగా విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర ప్రచార ప్రముఖ్ పగడాకుల బాలస్వామి, హిందూ జనశక్తి అధ్యక్షుడు లలిత్‌కుమార్, హిందూ ధార్మికసేన రాష్ట్ర అధ్యక్షుడు తమ్మళి రాజశేఖర్‌శర్మ తదితరులు మాట్లాడుతూ దేవాదాయశాఖ ఉన్నతాధికారులు ఇప్పటికైనా కళ్లు తెరిచి ఆలయాలపై పర్యవేక్షణ పెంచాలని కోరారు.

వీధి దీపాలు ఏర్పాటు



గట్టు: మండల కేంద్రంలో గురువారం సర్పంచ్ ధనలక్ష్మి వీధి దీపాలను ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామస్తులకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. అన్ని కాలనీల్లో వీధి దీపాలు ఏర్పాటుతో పాటు ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు ఏర్పడకుండా చూస్తున్నట్లు పేర్కొన్నారు.

కేసీఆర్ గారడీ మాటలు నమ్మొద్దు



ఇటిక్యాలలో వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

శాంతినగర్: కేసీఆర్ గారడీ మాటలను ప్రజలు నమ్మవద్దని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి రాజగోపాల్ అన్నారు. అర్హులందరికీ డబుల్‌బెడ్రూం ఇళ్లు మంజూరు చేయాలని గురువారం వడ్డేపల్లి డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులకు డబుల్‌బెడ్రూం ఇళ్లు నిర్మించి ఇవ్వకుండా.. ఇప్పుడు గృహలక్ష్మి పథకంతో రూ.3లక్షలు ఇస్తామని ప్రకటించడం హాస్యాస్పదమన్నారు. దరఖాస్తు చేసుకునేందుకు తక్కువ గడువు విధించి ప్రజలను నిలువునా మోసం చేసిందన్నారు. డిసెంబర్‌లో ముగియనున్న లిక్కర్ టెండర్లను ఈనెలలోనే ప్రకటించి రూ.30వేల కోట్లను రాబోయే ఎన్నికల్లో వాడుకునేందుకు యత్నిస్తోందని ఆరోపించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు నర్సింహులు, ఉపాధ్యక్షుడు ఆంజనేయులు, అశోక్, వెంకటేష్, హరిరాముడు పాల్గొన్నారు.

ఎర్రవల్లిచౌరస్తా: కేసీఆర్ ప్రభుత్వం గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి రాజగోపాల్ అన్నారు. గురువారం ఇటిక్యాల తహసీల్దార్ కార్యాలయం ఎదుట పార్టీ మండల అధ్యక్షుడు జగదీష్‌రెడ్డి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులందరికీ డబుల్‌బెడ్రూం ఇళ్లు, దళితబంధు, బీసీబంధు పథకాలను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ధనిక రాష్ట్రం అని చెబుతూ విలువైన ప్రభుత్వ భూములను అక్రమంగా అమ్ముతున్నారని మండిపడ్డారు. విద్యుత్, భూముల రిజిస్ట్రేషన్, బస్సు చార్జీలను విపరీతంగా పెంచి ప్రజలపై పెనుభారం మోపారని విమర్శించారు. అనంతరం సీనియర్ అసిస్టెంట్ అజిత్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కేకేరెడ్డి, అబ్దుల్లా, తిమ్మారెడ్డి, మాణిక్యారెడ్డి, నర్సింహ, జయరాజ్, మునీందర్‌రెడ్డి, వీరన్న, వెంకటేష్, ధనుంజయ్ పాల్గొన్నారు.

కార్మికులకు పెండింగ్ వేతనాలు చెల్లించాలి



కార్మికులనుద్దేశించి మాట్లాడుతున్న కృష్ణ

ధరూరు: మిషన్ భగీరథ పథకంలో పని చేస్తున్న కార్మికులకు పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి చింతరేవుల కృష్ణ డిమాండ్ చేశారు. మండలంలోని జూరాల వద్ద ఉన్న మిషన్ భగీరథ ప్లాంట్ వద్ద కార్మికులు చేపట్టిన సమ్మెకు గురువారం ఆయన మద్దతు తెలిపి మాట్లాడారు. ఐదు నెలలుగా వేతనాలు పెండింగ్‌లో ఉండటంతో కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కుటుంబాన్ని పోషించలేక పస్తులు ఉండే పరిస్థితి నెలకొందన్నారు. ఇక్కడ పనిచేసే అధికారులకు ప్రతినెలా 1వ తేదీనే జీతాలు వస్తుండగా.. కార్మికులపై ఎందుకు వివక్ష చూపుతున్నారని ప్రశ్నించారు. రాష్ట్రవ్యాప్తంగా పని చేస్తున్న 16వేలమంది కార్మికులకు పండుగ సెలవులు ఇవ్వాలని, పీఎఫ్ అమలు చేయాలని, జీవో నంబర్ 60 ప్రకారం స్కిల్ కార్మికులకు రూ.22,500, సెమీ స్కిల్ కార్మికులకు రూ.19,500, అన్ స్కిల్డ్ కార్మికులకు రూ.15,600 వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లక్ష్మయ్య, పవన్, రాజు, కన్నయ్య, జంబయ్య, మౌలన్న, శ్రీకాంత్, రవి, భీంరెడ్డి, యుగంధర్, శ్రీను, గోవిందు, జగదీష్, బాబు, సాయన్న, మోహన్, పవన్ పాల్గొన్నారు.

సమగ్రశిక్ష ఉద్యోగుల నిరసన



నిరసన తెలుపుతున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

అయిజ: స్థానిక ఎమ్మార్సీ భవనం ఎదుట గురువారం సమగ్ర శిక్ష ఉద్యోగులు నల్లబ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు బుధవారం ఎస్‌డీపీ కార్యాలయం ముట్టడి చేపట్టిన సమగ్ర శిక్ష ఉద్యోగులను పోలీసులు అక్రమంగా అరెస్టు చేయడం సరికాదన్నారు. సమగ్రశిక్ష ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్సీ సిబ్బంది శ్రీనివాసులు, ఉదయ్‌కిరణ్, బాబు, కేజీబీవీ సిబ్బంది భూదేవి, శృతి, లత పాల్గొన్నారు.

ఓటింగ్‌పై అవగాహన

పెబ్బేరు రూరల్: సాధారణ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని కలెక్టర్ ఆదేశాల మేరకు గురువారం శ్రీరంగాపురం పాత గ్రామ పంచాయతీలో మండల డిప్యూటీ తహసీల్దార్ శివకుమార్ ఆధ్వర్యంలో ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్‌పై ప్రజలకు అవగాహన కల్పించారు. మాక్ పోలింగ్‌లో జెడ్పీటీసీ రాజేంద్రప్రసాద్‌యాదవ్ పాటు 312 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు.